TGTEL/26/A6780

# స్పందన

తెలుగు దినపత్రిక

సంపుటి :01 | సంచిక :12 | పేజీలు 8 వెల : 5 | గురువారం 24 సెప్టెంబర్ 2026



2లో..

## యాంత్రికంగా 'సర్' నోటీసులు



2లో..

## ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత

## రాష్ట్రంలో కరెంట్ కోతలకు 'కాంగ్-నినో' కారణమన్న కేటీఆర్

- కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురక
- సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ
- జెన్‌కో వద్ద బొగ్గు నిల్వలు లేవని, థర్మల్ ప్లాంట్లు మూసేశారని విమర్శ
- రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్



2లో..



2లో..

## గణేశ్ నిమజ్జనం: 25న సెలవు, వేలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు

## పశ్చిమ బెంగాల్‌లో ముదిరిన వివాదం

- ఓటర్ల జాబితాపై రాజకీయ దుమారం
- ఎన్నికల సంఘంపై ప్రతిపక్ష విమర్శలు
- సర్ ప్రక్రియపై ఆరోపణల వెల్లువ
- కొత్త రాజకీయ సమరానికి తెర



కోల్‌కతా, సెప్టెంబర్ 23: పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన వివాదం మరింత తీవ్రరూపం దాల్చింది. ఓటర్ల పేర్ల చేర్పు, తొలగింపు వంటి అంశాలపై ఎన్నికల సంఘం కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయన్న వార్తలు వెలుగులోకి రావడంతో రాజకీయ వర్గాల్లో చర్చలు వేడెక్కాయి. ఈ నేపథ్యంలో అధికార -2 వ పేజీలో..



2లో..

## జూరాలకు కర్ణాటక నీళ్లు

**ఆలమట్టి నుంచి నీటి విడుదలకు అంగీకారం**

- జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక అంగీకారం
- విడతల వారీగా 3 టీఎంసీలు ఇచ్చేందుకు సీఎం డీకే శివకుమార్ సుముఖత
- బెంగళూరులో కర్ణాటక సీఎంతో తెలంగాణ మంత్రుల బృందం భేటీ
- జూరాల కింద రైతుల ఇబ్బందులను వివరించిన మంత్రులు జూపల్లి, శ్రీహరి

ఎల్‌నినో, వర్షాభావం నేపథ్యంలో జూరాలకు ఎగువ నుంచి ప్రవాహం లేదు. ఉన్న నీటినే తాగునీటి అవసరాలకు వచ్చే ఏడాది వరకు నిల్వ ఉంచాల్సి రావడంతో ఆయకట్టుకు నీరివ్వలేని పరిస్థితి. మరోవైపు పంటలు ఎండిపోకుండా సాగుకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది.ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది .రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది.

- రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- సీఎస్‌తో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశం
- అక్టోబర్ జీతంతో మొదటి డీఏ చెల్లింపు
- ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల
- చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు
- పీఆర్సీపై ఇంకా నిర్ణయం



## పల్లె ప్రజలకు ఆయుర్వేదం చేరాలి

**కార్యక్రమాన్ని ప్రారంభించిన సీతక్క**

ఆయుర్వేద వైద్య సేవలను పల్లె ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క అన్నారు. 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా బుధవారం ములుగు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య విధానం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. -2వ పేజీలో




## ఈ నెల 30న పేదలకు పట్టాభిషేకం..

- గౌరవ సీఎం చేతుల మీదుగా పండగ వాతావరణంలో పట్టాల పంపిణీ
- తొలిదశలో 24,042 మంది లబ్ధిదారులకు పట్టాలు
- అన్ని హక్కులతో ప్రజల దశాబ్దాల కల నెరవేరుతున్న శుభవేళ
- ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటం, ప్రతి పేద కుటుంబానికి శాశ్వత చిరునామా, పూర్తి హక్కులతో కూడిన ఆస్తి భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 30న విజయవాడలో గౌరవ ముఖ్యమంత్రి చేతులమీదుగా పండగ వాతావరణంలో పట్టాల పంపిణీ జరగనుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. తొలిదశలో జిల్లా వ్యాప్తంగా 24,042 మంది లబ్ధిదారులకు రూ. 23,213 కోట్ల మార్కెట్ విలువ కలిగిన ఆస్తి క్రమబద్ధీకరణ ద్వారా పేదల చేతికి అందుతుందని పేర్కొన్నారు. 2

## ఉత్తరాంధ్రలో భారీ వర్షాల హెచ్చరిక

- విశాఖ-గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని సూచన
- అధికార యంత్రాంగం అప్రమత్తం



విశాఖపట్నం, సెప్టెంబర్ 23: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తరాంధ్ర తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వ్యవస్థ రాగల కొన్ని గంటల్లో తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బుధవారం రాత్రి ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటే అవకాశాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం తీవ్ర తరువాయి 2 వ పేజీలో...



## డీఎస్సీ అక్రమాలపై గవర్నర్‌కు జగన్ ఫిర్యాదు

- సీబీఐ విచారణ జరిపించాలని వినతి
- విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్

విజయవాడ, సెప్టెంబర్ 23: డీఎస్సీ-2025 నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ డీఎస్సీ తరువాయి 2 వ పేజీలో...

## నేటి రాశి ఫలాలు

మేషం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులు వాయిదా పడతాయి. బంధువర్గంతో స్వల్ప వివాదాలు ఉంటాయి. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆరోగ్య సమస్యలు భాదిస్తాయి. ఇంటాబయట ఊహించని సమస్యలు కలుగుతాయి.

వృషభం: నిరుద్యోగుల యత్నాలు సఫలమౌతాయి. మిత్రులతో విందువినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఆకస్మిక ధన వస్తు లాభాలు పొందుతారు.

మిధునం: చేపట్టిన పనులు నత్తనడకన సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో ఒక వ్యవహారంలో మాటపట్టింపులు తప్పవు. నిరుద్యోగులకు శ్రమ తప్ప ఫలితం కనిపించదు. వృత్తి ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి.

కర్కాటకం: వృత్తి, వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. కుటుంబంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమవుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. ఉద్యోగమున అధికారులతో చర్చలు ఫలిస్తాయి.

సింహం: వ్యాపార, ఉద్యోగాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో కొద్దిపాటి ఆటంకాలు తప్పవు. ఆర్ధిక ఇబ్బందులు కొంత చికాకు పరుస్తాయి. కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. చిన్నపాటి ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి.

కన్య: కుటుంబ సభ్యులతో దైవదర్శనాలు చేసుకుంటారు. నూతనోత్సాహంతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి. నూతన గృహ వాహన యోగం ఉన్నది. సమాజంలో విశేషమైన ఆదరణ పెరుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి.

తుల: వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. రాజకీయ ప్రముఖుల నుండి సమావేశాలలో ఆహ్వానాలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు.

వృశ్చికం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో అధికారుల నుండి ఊహించని ఇబ్బందులు ఎదురవుతాయి. చేపట్టిన పనులు మందగిస్తాయి. ఆర్ధిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఉద్యోగయత్నాలు నత్తనడకన సాగుతాయి. వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి.

ధనస్సు: వృత్తి, వ్యాపారాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపించదు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కలసిరావు. సోదరులతో ఆస్తి విషయంలో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆలయ సందర్శనం చేసుకుంటారు.

మకరం: వ్యాపారాలలో విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. సంఘంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. విద్యార్థుల కష్టం ఫలిస్తుంది. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు.

కుంభం: వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. చాలాకాలంగా పూర్తికాని పనులు పూర్తి చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందువినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. దూరపు బంధువుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు. సంతాన విద్య ఉద్యోగ విషయంలో శుభవార్తలు అందుతాయి.

మీనం: పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో సహోద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చేయడం మంచిది. వృత్తి వ్యాపారాల్లో శ్రమ తప్ప ఫలితం కనిపించదు.



# జూరాలకు కర్ణాటక నీళ్లు

హైదరాబాద్: తెలంగాణకు కర్ణాటక స్నేహహస్తం అందించింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి ఆలమట్టి నుంచి నీటి విడుదలకు అంగీకరించింది. తెలంగాణ ప్రతినిధి బృందంతో బుధవారం మరోసారి చర్చలు జరిపిన కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దశలవారీగా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలమట్టి కింద పది రోజులపాటు వారబందీని అమలు చేసి నీటిని విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర ప్రతినిధుల బృందంలోని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బుధవారం నుంచే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారని చెప్పారు. కర్ణాటక నిర్ణయం రెండు రాష్ట్రాల మధ్య స్నేహానికి, సోదరభావానికి నిదర్శనమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. డీకే శివకుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే కర్ణాటక శాసనసభ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదని తెలిసింది.



### లేఖ రాసి, బృందాన్ని పంపి..

ఎల్‌నినో, వర్షాభావం నేపథ్యంలో జూరాలకు ఎగువ నుంచి ప్రవాహం లేదు. ఉన్న నీటినే తాగునీటి అవసరాలకు వచ్చే ఏడాది వరకు నిల్వ ఉంచాల్సి రావడంతో ఆయకట్టుకు నీరివ్వలేని పరిస్థితి. మరోవైపు పంటలు ఎండిపోకుండా సాగుకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆలమట్టి నుంచి ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని డీకే శివకుమార్‌ను ఫోన్లో కోరిన సీఎం రేవంత్‌రెడ్డి, ఓ ప్రతినిధి బృందాన్ని బెంగళూరుకు పంపారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు మంగళవారం బెంగళూరు వెళ్లి డీకే శివకుమార్‌తో చర్చలు జరిపారు. ముఖ్యమంత్రి రాసిన లేఖను అంద జేశారు. అంతకు ముందే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ రాశారు. జూరాల ఆయకట్టు రైతుల ఇబ్బందులను వివరించారు. బుధవారం మళ్లీ డీకేతో తెలంగాణ బృందం సమావేశం కాగా కర్ణాటక నీటిపారుదల శాఖ మంత్రి చలువరాయస్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి నీటి విడుదలకు ఆదేశాలు జారీ చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. కర్ణాటక ముఖ్యమంత్రికి, నీటిపారుదల శాఖ మంత్రికి, మాజీ మంత్రి బోసురాజు తదితరులకు జూపల్లి కృతజ్ఞతలు తెలిపారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, నీటిపారుదల శాఖ అధికారులతో గురువారం సమావేశమై జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల నుంచి సాగు, తాగు అవసరాలకు ఆ నీటిని ఎలా వాడుకోవాలో చర్చిస్తామని పేర్కొన్నారు.

## 4 కొత్త పోలీస్ కమిషనరేట్లకు ఆమోదం

మొదటి పేజీ తరువాయి

సదుపాయాల అభివృద్ధి పనులకు రూ.1,548.98 కోట్ల పరిపాలనా అనుమతిని మంజూరు చేసింది. అదనంగా నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, వర్షపు నీటి కాలువలు, రహదారులు, వీధి దీపాల పనుల కోసం రూ.644.98 కోట్లను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. అసెంబ్లీ భవన నిర్మాణంలో భాగంగా స్పైర్, రూఫ్, లిఫ్టల నిర్మాణానికి రూ.661 కోట్ల నిధులకు కూడా అనుమతి ఇచ్చింది. ల్యాండ్ పూలింగ్ పథకంలో భూములు ఇచ్చిన రైతులకు సంబంధించిన నిబంధనల్లో మార్పులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఒక ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన అర్హులైన రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే 1,304



మంది రైతులకు చెల్లించిన యాన్యుటీ మొత్తాన్ని కూడా ఆమోదించింది. పారిశ్రామిక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా పలు ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు మంజూరు చేసింది. వై హోమ్ ఇండస్ట్రీస్ గ్రీన్‌ఫీల్డ్ సిమెంట్ యూనిట్, క్యాటర్‌పిల్లర్ ఇండియా ప్రాజెక్టు, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ విస్తరణ కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చింది. కుప్పం పరిధిలో పలు పరిశ్రమలకు భూకేటాయింపులకు కూడా ఆమోదం తెలిపింది. ఐటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విద్యుత్ రంగంలో సోలార్, విండ్, హైబ్రిడ్ విద్యుత్ ప్రాజెక్టులతో పాటు 1,344 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, 500 మెగావాట్ల శక్తి నిల్వ సామర్థ్యాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసింది. పర్యాటక రంగంలో అమరావతి, కడప, రేణిగుంట ప్రాంతాల్లో హోటల్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఆహార ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, స్టీల్, సిమెంట్, పారిశ్రామిక పార్కులకు సంబంధించిన ప్రతిపాదనలకు కూడా ఆమోదం తెలిపింది. అదనంగా న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 61 నుంచి 62 ఏళ్లకు పెంచడం, సామాజిక మాధ్యమ ప్రభావశీలుల విధానం, ప్రభుత్వ భూముల కేటాయింపులు, ఎక్సైజ్ విధానం, వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతి అవకాశాల కల్పన వంటి అంశాలపై కూడా కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది.

## డీఎస్సీ అక్రమాలపై గవర్నర్‌కు జగన్ ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి

వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని కోరినట్లు వెల్లడించారు. అలాగే శాప్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడికి సంబంధించిన ఆధారాలను కూడా గవర్నర్‌కు సమర్పించినట్లు తెలిపారు.

డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు తాము పేర్కొంటున్న అక్రమాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని జగన్ చెప్పారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్ష నిర్వహణ వంటి కీలక బాధ్యతలను ఒకే అధికారికి అప్పగించడం ద్వారా వ్యవస్థలో లోపాలు ఏర్పడ్డాయని ఆరోపించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని, కొన్ని నియామకాల విషయంలో అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటిపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని అభిప్రాయపడ్డారు. క్రీడా కోటా నియామకాల విషయంలో కూడా అనేక సందేహాలు ఉన్నాయని జగన్ ఆరోపించారు. నియామకాల కోసం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు, వాటి అమలు విధానం, ఉద్యోగాల కేటాయింపులపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. కొన్ని క్రీడా ధ్రువపత్రాల ప్రామాణికతపై కూడా అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ సంబంధిత అంశాలను గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు.

శాప్ కార్యాలయం వద్ద జరిగిన ఘటనపై కూడా జగన్ స్పందించారు. శాంతియుత నిరసన కార్యక్రమానికి ముందస్తు సమాచారం ఇచ్చినా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగాయని ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, ఇతర ఆధారాలను గవర్నర్‌కు అందజేసినట్లు తెలిపారు. తమ పార్టీ నాయకులపై హత్యాయత్నం, ఇతర కేసులు నమోదు చేయడాన్ని కూడా ఆయన విమర్శించారు.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని జగన్ పేర్కొన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో పారదర్శకత అవసరమని, డీఎస్సీ నియామకాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి సీబీఐ దర్యాప్తు

## పల్లె ప్రజలకు ఆయుర్వేదం చేరాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయుర్వేదం భారతీయ సంప్రదాయ వైద్య విధానమని, సహజ చికిత్సా విధానాల ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణలో నివారణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ఆయుర్వేద ప్రత్యేకత అని వివరించారు. ఏటూరునాగారం ఆయుర్వేద ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు వైద్య సేవల విస్తరణకు కృషి చేస్తామని చెప్పారు. ప్రజలకు మెరుగైన చికిత్స అందేలా అవసరమైన వనరులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉచిత ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు ఆయుర్వేద చికిత్సా విధానాల గురించి వివరించారు. శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై సేవలను వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య శిబిరాలు ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సంప్రదాయ వైద్య విధానాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయుర్వేద సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# యాదాద్రి థర్మల్‌కు ‘బొగ్గు ఎలా’?

హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి జరగకపోవడానికి కారణాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులను ప్రశ్నించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో బుధవారం విద్యుత్ శాఖపై నిర్వహించిన సమీక్షలో యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మాణం, బొగ్గు లభ్యత, రవాణా వ్యయం, సింగరేణి పరిస్థితులు, రాష్ట్రంపై పడుతున్న అదనపు ఆర్థిక భారం తది తర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో యాదాద్రి ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.



### జీ9 బొగ్గు అవసరం

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి జీ9 నాణ్యత కలిగిన బొగ్గు అవసరమని అధికారులు సమీక్షలో వివరించారు. అయితే సింగరేణి బొగ్గు గనుల్లో ప్రస్తుతం జీ9 బొగ్గును ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని తెలిపారు. సమీప భవిష్యత్తులో సింగరేణి నుంచి జీ9 బొగ్గు అందుబాటులోకి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిపై సీఎం, డిప్యూటీ సీఎం తీవ్రంగా ప్రశ్నించినట్లు తెలిసింది. జీ9 బొగ్గు లభ్యతే సమస్యగా ఉన్నప్పుడు అదే నాణ్యతకు అనుగుణంగా సాంకేతికతను ఉపయోగించి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఎందుకు నిర్మించాల్సి వచ్చిందని అధికారుల నుంచి వివరాలు కోరారు. ప్లాంట్ నిర్మాణ సమయంలో బొగ్గు లభ్యత, భవిష్యత్తులో అవసరాలు, రవాణా వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారా? లేకపోతే ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించినట్లు సమాచారం. సాగుకు కేవలం సోలార్ విద్యుత్ మాత్రమే సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వం డిస్కంలకు సూచించిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు.

### పిట్‌హెడ్ విధానంపై ప్రశ్నలు

సాధారణంగా బొగ్గు గనుల సమీపంలోనే థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే బొగ్గు రవాణా వ్యయం తగ్గుతుంది. దీనినే పిట్‌హెడ్ విధానం అంటారు. అయితే యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని బొగ్గు గనులకు దూరంగా ఎందుకు ఏర్పాటు చేశారనే అంశంపైనా సీఎం, డిప్యూటీ సీఎం అధికారులను నిలదీశారు. యాదాద్రి ప్లాంట్‌ను పిట్‌హెడ్ ప్రాంతంలో కాకుండా దూరంగా ఏర్పాటు చేయడం వల్ల బొగ్గును రైలు, ఇతర రవాణా మార్గాల ద్వారా తరలించాల్సి వస్తోందని, దీంతో విద్యుత్ ఉత్పత్తి వ్యయం పెరుగుతోందని అధికారులు వివరించినట్లు తెలిసింది. ప్లాంట్ నిర్మాణ సమయంలోనే ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్నారా? దూరంగా నిర్మించడం వల్ల రాష్ట్రానికి దీర్ఘకాలంలో ఎంత అదనపు భారం పడుతుందనే దానిపైనా వివరాలు సమర్పించాలని సీఎం సూచించారు.

### రాజకీయ కారణాలతోనేనా?

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పిట్‌హెడ్ ప్రాంతంలో ఏర్పాటు చేయకుండా దూరంగా నిర్మించడానికి గతంలో రాజకీయ కారణాలే ప్రధానంగా ఉన్నాయని అధికారులు సమీక్షలో వెల్లడించినట్లు సమాచారం. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం మరిన్ని వివరాలు అడిగినట్లు తెలిసింది. బొగ్గు గనుల నుంచి దూరంగా ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుతం బొగ్గు రవాణా, సరఫరా వ్యయం రాష్ట్ర ఖజానాపై భారంగా మారిందని అధికారులు వివరించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గును తరలించి సరఫరా చేయడం వల్ల తెలంగాణపై రూ.40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని అధికారులు సమీక్షలో తెలిపారు. బొగ్గు ధరతోపాటు రవాణా, ఇతర సంబంధిత ఖర్చులు కూడా విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని పెంచుతున్నట్లు వివరించారు.

# కన్‌సాన్‌పల్లిలో 'ఇరుముడి' సినిమా ప్రదర్శన

## భక్తిభావాన్ని పెంపొందించడమే లక్ష్యం: బీఆర్ఎస్ యువ నాయకుడు ధీరజ్‌రెడ్డి

**అందోలు, సెప్టెంబర్ 23 (స్పందన )**

:వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అందోలు మండలం కన్‌సాన్‌పల్లి గ్రామంలో సోమవారం రాత్రి 'ఇరుముడి' సినిమాను ఘనంగా ప్రదర్శించారు. బీఆర్ఎస్ యువ నాయకుడు నోమన్నగారి ధీరజ్‌రెడ్డి ఆధ్వర్యంలో, వినాయక ఉత్సవ కమిటీ సహకారంతో దుర్గా భవాని ఆలయ ప్రాంగణంలోని వినాయక మండపం వద్ద ప్రత్యేకంగా వెండితెరను ఏర్పాటు చేసి సినిమా ప్రదర్శించారు.

ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువత, మహిళలు, పెద్దలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సినిమాను ఆసక్తిగా వీక్షించారు. "ఆధ్యాత్మికతతో కూడిన మంచి చిత్రాలు యువతలో భక్తిభావంతో పాటు సన్మార్గం పట్ల ఆలోచనను



పెంపొందిస్తాయి. పండుగ వేళ గ్రామ ప్రజలందరూ కలిసి ఆనందంగా గడపాలనే ఉద్దేశంతో ఈ సినిమా ప్రదర్శన ఏర్పాటు చేశాం" అని ధీరజ్‌రెడ్డి తెలిపారు'ఇరుముడి' చిత్రంలోని తండ్రీకూతుళ్ల అనుబంధం, అయ్యప్ప స్వామి దీక్షకు సంబంధించిన భక్తిరస అంశాలు కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామంలోనే వెండితెరపై సినిమా ప్రదర్శించడం

ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.థియేటర్లకు వెళ్లలేని ప్రేక్షకులకు తమ గ్రామంలోనే కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలతో కలిసి సినిమా చూసే అవకాశం కల్పించినందుకు ధీరజ్‌రెడ్డికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. సినిమా ప్రదర్శనతో కన్‌సాన్‌పల్లి గ్రామంలో పండుగ సందడి మరింత పెరిగింది.

# వినాయక లడ్డూకు రూ.1.46 లక్షల ధర

## వేలం పాటలో దక్కించుకున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆదిత్య వినాయక రెడ్డి

**పటాన్ చెరు, సెప్టెంబర్ 23, (స్పందన):**

బీరంగూడ డివిజన్ పరిధిలోని వందనపురి కాలనీలో రామ్ కీ సేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన గణనాథుడికి నవరాత్రుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నైవేద్యాలు నిర్వహించారు. కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకుడి లడ్డూను ఉత్సవాల ముగింపు సందర్భంగా వేలం పాట నిర్వహించారు. రామ్ కీ సేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలో పలువురు భక్తులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీగా సాగిన వేలం పాటలో చివరకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆదిత్య వినాయక రెడ్డి





రూ.1,46,116లకు వినాయకుడి లడ్డూను కైవసం చేసుకున్నారు.వినాయకుడి లడ్డూను వేలం ద్వారా దక్కించుకోవడం పట్ల ఆదిత్య వినాయక రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, ప్రజలను భాగస్వాములను చేస్తున్న రామ్ కీ సేన యూత్ అసోసియేషన్

సభ్యులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. వేలం పాట కార్యక్రమంలో కాలనీ వాసులు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, లడ్డూ వేలం పాట కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# వీ హబ్ ను సందర్శించిన గీతం విద్యార్థినులు

## గీతం మహిళా సాధికారిత సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు

## వ్యవస్థాపకత, స్టార్టప్ లపై అవగాహన

**పటాన్ చెరు, సెప్టెంబర్ 23, (స్పందన):**

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థినులు బుధవారం వీ హబ్ (ఔజు ఎఖదీ)ను సందర్శించారు. గీతం మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పారిశ్రామిక సందర్శన ద్వారా విద్యార్థులకు వ్యవస్థాపకత, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై విలువైన అవగాహన కల్పించారు. మహిళా సాధికారత సెల్ ఛైర్ పర్సన్ ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ పర్యవేక్షణలో, సుమారు 40 మంది విద్యార్థినులు, ఐదుగురు మహిళా అధ్యాపకులు ఈ సందర్శనలో పాల్గొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం భారతదేశపు మొట్టమొదటి రాష్ట్ర-ఆధారిత నోడల్ సంస్థ అయిన వీ హబ్, విద్యార్థులకు ఆవిష్కరణ,






వ్యాపార సృష్టి, మార్గదర్శకత్వం, నెట్ వర్కింగ్, పారిశ్రామిక మద్దతుపై అవగాహన కల్పించారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను వాస్తవ ప్రపంచ పారిశ్రామిక పద్ధతులతో అనుసంధానించుకోవడంతో పాటు, మహిళా నేతృత్వంలోని వ్యవస్థాపకత, నాయకత్వం, సృజనాత్మకత, సమస్య-పరిష్కారంపై అవగాహన పొందారు. ఇది వారి వృత్తిపరమైన, వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడే ఒక అర్థవంతమైన అనుభవపూర్వక అభ్యాస అవకాశంగా ఉపయోగపడింది. ఈ సందర్శనలో సీఎస్ఎస్ఈ విభాగం నుంచి జ్యోతి బంకాపల్లి, డాక్టర్ అపర్ణ, ఆర్కిటెక్చర్ విభాగం నుంచి డాక్టర్ సౌపూర్ణి పాల్, మనస్తత్వశాస్త్ర విభాగం నుంచి డాక్టర్ దుర్గేష్ నందిని తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల కోసం ఇటువంటి విజ్ఞానదాయకమైన, పరిశ్రమల ఆధారిత కార్యక్రమాలను ఏర్పాటు చేసినందుకు విశ్వవిద్యాలయ నాయకత్వానికి, మహిళా సాధికారత విభాగానికి విద్యార్థి బృందం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

# యాంత్రికంగా 'సర్' నోటీసులు

దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కసరత్తులో భాగంగా ప్రజలకు యాంత్రికంగా నోటీసులు జారీ చేస్తున్నారనీ, ఈ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని సుప్రీంకోర్టు మంగళవారం ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. సహేతుక వ్యత్యాసాల (లాజికల్ డిస్క్రిపెన్సీ)ను ఏ ప్రాతిపదికన గుర్తిస్తున్నారో స్పష్టీకరించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనల ధర్మాసనం ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది డీఎస్ నాయుడును ఆదేశించింది. "ప్రజలకు యాంత్రికంగా నోటీసులు జారీ చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అదనపు జాగ్రత్తలేవైనా తీసుకోవాలేమో చూడండి. లాజికల్ డిస్క్రిపెన్సీగా గుర్తించేందుకు ప్రాతిపదిక ఏదన్నది స్పష్టం కావాలి" అని ధర్మాసనం నిర్దేశించింది. నోటీసులు ఎవరికి జారీ చేశారో, వారికి ఎందుకు జారీ చేశారో తెలియజేయడంలో ఎన్నికల ప్రధానాధికారి, దిల్లీ ముఖ్య ఎన్నికల అధికారి విఫలమయ్యారని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ అభిప్రాయం వ్యక్తం చేసింది.ఓటర్లను సహేతుక వ్యత్యాసాల కేటగిరీ కిందికి చేర్చేందుకు అనుసరిస్తున్న ప్రమాణాలు, అందుకు సంబంధించిన మాటల అర్థాలు, ఆల్గోరిథం సంబంధమైన ప్రమాణాలు, మార్గనిర్దేశకాలను వెల్లడించాలని కోరుతూ అంజలీ భరద్వాజ్, అమృతా జోహ్రీ అనే ఇద్దరు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణలో భాగంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. చిన్న చిన్న సాకులతో కేవలం దిల్లీలో 33 లక్షల మందికి నోటీసులు జారీ చేశారని పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించిన ప్రశాంత్ భూషణ్



పేర్కొన్నారు. ఈ నోటీసులు అందుకున్న వారు సహేతుక వ్యత్యాసాన్ని సవరించేందుకు కమిషన్ సూచించిన 12 డాక్యుమెంట్లలో ఒకటి సమర్పించాల్సి వస్తోందని, ఇది ఓటర్లకు ఇబ్బందులు సృష్టిస్తోందని ఆయన వాదించారు. పిటిషనర్లు తమ వాదనకు బలం చేకూర్చే వాస్తవ ఉదంతం ఒక్కటీ ప్రస్తావించలేదని, నోటీసులు ఇవ్వడానికి గల కారణాలను ఈసీ ఓటర్లకు తెలియజేస్తోందని ఈసీ న్యాయవాది డీఎస్ నాయుడు కోర్టుకు తెలిపారు. పిటిషనర్లు లేవనెత్తిన అనేక విషయాలపై ఎన్నికల సంఘం ఇటీవల నిర్వహించిన

మీడియా సమావేశంలో వివరణ ఇచ్చిందన్నారు.నోటీసులకు సంబంధించి చర్యలు తీసుకునేందుకు ఎందరు బీఎల్ఓలను నియమించారు అని ధర్మాసనం ప్రశ్నించింది. "మీరు 30 లక్షల నోటీసులు పంపారు. వాటి పరిష్కారానికి ఎందరు బీఎల్ఓలను నియమించారు?" అని న్యాయమూర్తులు అడిగారు. దాదాపు 15 వేల మంది బీఎల్ఓలు, 1200 మంది ఈఆర్ఓలు నియమించామని ఈసీ తరఫు న్యాయవాది విన్నవించారు.

# మహిళా డిగ్రీ కళాశాల పీహెచ్‌సీ, ఎమ్మార్వో కార్యాలయం, ఎస్సీ హాస్టల్‌లో కలెక్టర్ తనిఖీ

**మునిపల్లి, సెప్టెంబర్ 23 ( స్పందన )**





సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, బుధవారం మునిపల్లి మండలంలో ఆకస్మికంగా పర్యటించి బుదేరా మహిళా డిగ్రీ కళాశాల, మునిపల్లి పీహెచ్‌సీ, ఎమ్మార్వో కార్యాలయం, ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థుల వసతి, భోజనం, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకోని ఆసుపత్రికి పెయింటింగ్ వేయించాలని సూచించారు. ఎమ్మార్వో కార్యాలయంలో భూ భారతి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని, ఎస్ఐఆర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్ల వద్ద ఫ్లోరింగ్ వేయించాలని సూచించారు.కలెక్టర్ వెంట సోషల్ వెల్ఫేర్ డీఈ రాజు, జిల్లా సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి, అందోల్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి జగదీశ్వర్, యూత్ , స్పోర్ట్స్ ఆఫీసర్ అఖిలేష్ , ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి రామాచారి, ఎమ్మార్వో రంగారావు, ఆర్ఐ సాయికిరణ్, పంచాయతీ కార్యదర్శి నర్సింలు తదితరులు ఉన్నారు.

# ప్రతిభ విద్యానికేతన్ ఉపాధ్యాయునికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**జిన్నారం, సెప్టెంబర్ 23(స్పందన న్యూస్):**



జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని ప్రతిభ విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు కార్తీక్ రాజ్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. బుధవారం పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయిలో జీఎంఆర్ కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో కార్తీక్ రాజ్‌కు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా కార్తీక్ రాజ్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు అవార్డు అందుకోవడం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపల్ సారా శ్రీనివాస్ పేర్కొంటూ కార్తీక్ రాజ్‌ను అభినందించారు.

# త్రిశూల్ యువసేన వినాయక మండపంలో...

## - 3.66 లక్షలు పలికిన వినాయక లడ్డు రెండవ లడ్డు మూడు లక్షల ఒక వెయ్యి





**పటాన్ చెరు, సెప్టెంబర్ 23, (స్పందన):**

మూడు లక్షల అరవై ఆరు వేలు పలికిన వినాయక లడ్డు. పటాన్ చెరు పట్టణ కేంద్రంలో త్రిశూల్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. త్రిశూల్ యువసేన సభ్యులు ఎంతో భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. వినాయక నిమజ్జనం రోజు ఏర్పాటు చేసిన వేలం పాటలో మొదటి లడ్డును మూడు లక్షల 66 వేలకు భీమ్ శెట్టి శివప్రసాద్ కైవసం చేసుకోగా, రెండవ లడ్డుకే జరిగిన వేలం పాటలు రాజశేఖర్ రెడ్డి మూడు లక్షల ఒక్క వెయ్యి 11 రూపాయలకు దక్కించుకున్నాడు. త్రిశూల్ యువసేన ఆధ్వర్యంలో ఎంతో భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని పట్టణంలోని వాడ వాడల ఊరేగిస్తూ, స్థానిక తిమ్మక్క చెరువులో నిమజ్జనం పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో త్రిశూల్ యువసేన సభ్యులు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# శాకంబరేశ్వరుడుగా దర్శనమిచ్చిన గణనాథుడు

## - పదవ రోజున వినూత్న రీతిలో ఘనపయ్య

**పటాన్ చెరు, సెప్టెంబర్ 23, (స్పందన):**



వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా పదవరోజు శాకంబరేశ్వరుడిగా దర్శనమిచ్చిన ఘనపయ్య. ఇస్నాపూర్ మున్సిపాలిటీ రుద్రారం గ్రామ శివారులో గల గణేష్ గడ్డ దేవాలయంలో పదవరోజు వినూత్న రీతిలో కొలువు దీరిన గణనాధుని ఆశీస్సుల కొరకు భక్తుల రద్దీ పెరిగింది. పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలతో పాటు హైదరాబాదు, చుట్టుపక్కల జిల్లాల నుండి భక్తులు గణేష్ గడ్డ ఆలయానికి బాట పట్టారు. వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా గణపయ్య దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈవో లావణ్య, ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, రుద్రారం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శుక్రవారం హైదరాబాద్ లో వైన్ షాపులు, బార్లు బంద్




హైదరాబాద్ :పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 25న (శుక్రవారం) జరగనున్న ప్రధాన గణేశ్ మహా నిమజ్జనం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పలు ముఖ్యమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి.మహా నిమజ్జనం, భారీ శోభాయాత్రల వల్ల నగరంలో ఏర్పడే రద్దీని దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 25న తెలంగాణ హైకోర్టుతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబార్డినేట్ కోర్టులన్నింటికీ సెలవు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెలవుకు బదులుగా డిసెంబర్ 5వ తేదీ శనివారాన్ని వర్కింగ్ డేగా ప్రకటించారు.మరొకవైపు ప్రశాంత వాతావరణంలో వేడుకలు పూర్తి కావడానికి వీలుగా మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించారు.

# కుటుంబానికే నిషా ప్రాధాన్యత



హైదరాబాద్, సెప్టెంబరు 23 : సినీ పరిశ్రమలో వారసత్వంగా అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటీనటులలో నిషా అగర్వాల్ ఒకరు. స్టార్ కథానాయిక కాజల్ అగర్వాల్ సోదరిగా చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, తక్కువ సమయంలోనే తన అందం, అభినయంతో ప్రేక్షకులను అలరించారు. 2010లో వరుణ్ సందేశ్ సరసన 'ఏమైంది ఈ వేళ' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత 'సోలో', 'సుకుమారుడు', 'డీకే బోస్' వంటి చిత్రాలలో నటించి తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే కెరీర్ ఊపందుకుంటున్న సమయంలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన నిషా, ఆ తర్వాత మాతృత్వానికి ప్రాధాన్యతనిస్తూ నటనకు పూర్తిస్థాయిలో స్వస్తి చెప్పారు. అక్క కాజల్ అగర్వాల్ ఇప్పటికీ వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, నిషా మాత్రం కుటుంబ జీవితానికే మొగ్గు చూపారు. వెండితెరకు దూరమైనప్పటికీ, సోషల్ మీడియా వేదికగా నిరంతరం అభిమానులతో ముచ్చటిస్తూ తన విశేష క్రేజ్‌ను కొనసాగిస్తున్నారు.

# మూడేళ్ల పాటు ఒకే రకమైన..

## సదా భావోద్వేగ వ్యాఖ్యలు



హైదరాబాద్, సెప్టెంబరు 23 : 'జయం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న కథానాయిక సదా, తన సినీ ప్రయాణంలోని ఒడుదొడుకులు మరియు బుల్లితెర ప్రదర్శనల గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, సినీ పరిశ్రమలో సరైన మార్గదర్శకత్వం లేకపోవడం వల్ల కొన్ని అవకాశాలను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నితిన్ నటించిన చిత్రంలో 'రాను రాను అంటుందో చిన్నదో' పునర్నిర్మిత గీతం కోసం తనను సంప్రదించడానికి నిర్మాతలు ప్రయత్నించినట్లు తెలిసినప్పటికీ, ఆ వార్త తన వరకు రాలేదని, మధ్యలో ఆఫర్లను ఎవరు అడ్డుకుంటున్నారో అర్థం కావడం లేదని స్పష్టం చేశారు. 'ఢీ' నృత్య ప్రదర్శనకు వరుసగా మూడేళ్ల పాటు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన తర్వాత ఒకే రకమైన శైలి అనిపించడంతోనే విరామం తీసుకున్నానని ఆమె తెలిపారు. తమిళంలో చేసిన 'టార్చ్ లైట్' చిత్రంలో మహిళా ప్రాధాన్యత ఉన్న కథ కావడంతోనే సాహసంతో ఆ పాత్ర చేశానని, అయితే ప్రేక్షకులు దాన్ని కథగా కాకుండా తన పాత్రను ప్రశ్నించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. సినిమాలకు దూరమైనప్పటికీ ప్రేక్షకులు చూపుతున్న ఆదరణ పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# టాలీవుడ్ రీ-ఎంట్రీపై మలయాళ భామ కళ్యాణి ప్రియదర్శన్ చూపు

హైదరాబాద్, సెప్టెంబరు 23 : తక్కువ సినిమాలతోనే తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మలయాళ నటి కళ్యాణి ప్రియదర్శన్, సరైన కథ లభిస్తే టాలీవుడ్‌లోకి మళ్లీ రీ-ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ కుమార్తెగా చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, తన సహజసిద్ధమైన నటనతో తెలుగు యూత్‌లో విశేషమైన అభిమాన గణాన్ని సంపాదించుకున్నారు. అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించిన 'హలో' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన కళ్యాణి, తొలి సినిమాతోనే మంచి గుర్తింపు పొందారు. ఆ తర్వాత సాయి ధరమ్ తేజ్‌తో నటించిన 'చిత్రలహరి' బాక్సాఫీస్ వద్ద విజయం సాధించగా, శర్వానంద్ సరసన చేసిన 'రణరంగం' ఆశించిన విజయాన్ని అందించలేకపోయింది. టాలీవుడ్‌లో కేవలం మూడు సినిమాలు మాత్రమే చేసినప్పటికీ, ఆమె పాత్రలకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు లభించాయి. ప్రస్తుతం మలయాళంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ కథానాయిక, స్క్రిప్ట్ ప్రాధాన్యత ఉన్న మంచి పాత్ర లభిస్తే తెలుగులో మళ్లీ అలరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సోషల్ మీడియాలో నిరంతరం క్రియాశీలకంగా ఉంటూ అభిమానులకు చేరువగా ఉండే కళ్యాణి, త్వరలోనే ఒక మంచి ప్రాజెక్ట్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# మైత్రీ థియేటర్లలో సర్వపిండి

హైదరాబాద్, సెప్టెంబరు 23 : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయ పల్లె రుచులకు పెద్దపీట వేస్తూ ప్రముఖ నిర్మాణ సంస్థ 'మైత్రీ థియేటర్స్' ఒక వినూత్న నిర్ణయం తీసుకుంది. ఇకపై థియేటర్లలో కేవలం సినిమాలను ఆస్వాదించడమే కాకుండా, అచ్చమైన తెలంగాణ పిండివంటలను రుచి చూసే సరికొత్త అనుభూతిని ప్రేక్షకులకు అందించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా తెలంగాణ ప్రజలు ఎంతో ఇష్టపడే సాంప్రదాయ వంటకం 'సర్వపిండి'ని తమ మైత్రీ విమల్ మరియు మైత్రీ శివగంగ థియేటర్లలో ప్రత్యేకంగా అందుబాటులోకి తెస్తున్నట్లు యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. 'బామ్మాస్టోరీస్' భాగస్వామ్యంతో ప్రత్యేక అనుభూతి ఈ గురువారం ప్రేక్షకుల ముందుకు రానున్న నేచరల్ స్టార్ నాని భారీ చిత్రం 'ది ప్యారడైజ్' ప్రదర్శన సమయంలో, ఇంటర్వెల్ బ్రేక్‌లో ఈ సర్వపిండిని ప్రత్యేక ఆకర్షణగా విక్రయించనున్నారు. సోషల్ మీడియాలో ఎంతో ఆదరణ పొందిన 'బామ్మాస్టోరీస్'కు చెందిన 77 ఏళ్ల బామ్మ ప్రతిభను గు గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఒక చిన్న టిఫిన్ సెంటర్ స్థాయి నుంచి ప్రారంభమైన ఆమె చేతివంట ప్రయాణం, ఇప్పుడు బిగ్ స్క్రీన్ థియేటర్లలో ప్రదర్శితమయ్యే స్థాయికి చేరడం విశేషం. సినిమా చూస్తూ స్వచ్ఛమైన తెలంగాణ రుచులను ఆస్వాదించే ఈ సరికొత్త ప్రయోగం సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



# కూచిపూడితో మెప్పించిన డింపుల్..

టాలీవుడ్ అందాల భామ డింపుల్ హయాతి తిరుమలలోని నాద నీరాజనం వేదికపై అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి భక్తులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎరుపు, గోల్డ్ కలర్ సిల్క్ చీర కట్టి, సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో ఆమె ప్రదర్శించిన కూచిపూడి నాట్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది.ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల పవిత్ర సమయంలో డింపుల్ హయాతి నాద నీరాజనం వేదికపై కూచిపూడి నాట్యం చేయడం విశేషం. సంప్రదాయబద్ధమైన నృత్య భంగిమలు, చక్కటి ముఖకవళికలతో ఆమె చేసిన ప్రదర్శన భక్తులకు కనులవిందుగా నిలిచింది. ఇక నృత్య ప్రదర్శనకు ముందు రోజు ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఇన్నాళ్లూ సినిమాల్లో గ్లామరస్ పాత్రల్లో అలరించిన డింపుల్ హయాతిలో ఈ స్థాయి సంప్రదాయ నాట్య ప్రతిభ కూడా ఉందా అని నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఆమె డ్యాన్స్ వీడియోలు చూసిన అభిమానులు "డింపుల్ గారు చాలా అందంగా, అద్భుతంగా నాట్యం చేశారు" .




Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780